క్లుప్తంగా...

రేపు సీనియర్ సిటిజన్స్‌కు పాటల పోటీలు

రామంతాపూర్: గుప్తా గార్డెన్‌లోని సీనియర్ సిటిజన్ సంఘం భవనంలో ఆదివారం ఉదయం 10 గంటలకు సీనియర్ సిటిజన్స్‌కు పాటలు, పద్యాలు, శ్లోకాల పోటీలు నిర్వహిస్తున్నామని సంఘం అధ్యక్షుడు సత్తి రాజు కపర్తీశ్వర్‌రావు తెలిపారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామని, ఆసక్తి ఉన్న వారు సకాలంలో సంఘం భవనానికి రావాలని ఆయన కోరారు.

నేడు బీఆర్‌ఎస్ విస్తృతస్థాయి సమావేశం

కుషాయిగూడ: బీఆర్‌ఎస్ చర్లపల్లి డివిజన్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశాన్ని శనివారం చర్లపల్లి సిరి గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నట్లు కార్పొరేటర్ బొంతు శ్రీదేవి తెలిపారు. సమావేశానికి బీఆర్‌ఎస్ ఉప్పల్ నియోజకవర్గం అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి డివిజన్‌కు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ఉద్యమనేతలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

శుభాకాంక్షలు



నందికంటి శ్రీధర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: అల్వాల్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం నందికంటి శ్రీధర్ కలిశారు. ఎంబీసీ చైర్మన్‌గా నియమితులైన శ్రీధర్‌ను ఆయన ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు డోలి రమేష్, శ్రీనివాస్‌గౌడ్, గుత్తి రాంచందర్, వంశీ ముదిరాజ్, పవన్ తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ న్యూ వెంకటేశ్వరనగర్‌కు చెందిన యాదగిరి గుండెపోటులో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు మేకల రాముయాదవ్ యాదగిరి మృతుడి కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు.

నాచారం సీఐగా ప్రభాకర్‌రెడ్డి



మల్లాపూర్: నాచారం పోలీస్‌స్టేషన్ సీఐగా ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. యాదగిరిగుట్ట టూటౌన్‌లో పనిచేసి నాచారం ప్రాంతానికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. ప్రసుత్తం సీఐగా పనిచేసిన నందీశ్వర్‌రెడ్డి సైబర్ క్రైమ్‌కు బదిలీపై వెళ్లారు.

చిలుకానగర్ పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం తినిపిస్తున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి



మేడిపల్లి పాఠశాలలో మంత్రి మల్లారెడ్డి



విద్యార్థులు మరింత చురుగ్గా..

- దేశంలో ఎక్కడా లేనివిధంగా బ్రేక్‌ఫాస్ట్ పథకం
- హోంమంత్రి మహ్మద్ మహమూద్ అలీ



ఉప్పల్ పారిశ్రామికవాడలో మన ట్రస్ట్.. బ్రేక్ ఫాస్ట్ వాహనాన్ని ప్రారంభిస్తున్న హోంమంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ తదితరులు

ఉప్పల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఒకటో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు అందించే అల్పాహార పథకం ఉద్దేశ్యం ఎంతో గొప్పదని, దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో ప్రవేశపెట్టామని, దీంతో విద్యార్థులు మరింత చురుగ్గా తయారవుతారని హోంమంత్రి మహ్మద్ మహమూద్ అలీ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఉప్పల్ పారిశ్రామికవాడలోని మన ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బ్రేక్‌ఫాస్ట్ వాహనాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ పంకజ, డీసీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల పట్ల అన్ని జాగ్రత్తలు

చిలుకానగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అల్పాహార పథకాన్ని ప్రారంభించేందుకు ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి హాజరయ్యారు. స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్‌తో కలిసి ప్రారంభించారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత విద్యార్థుల ఆరోగ్యం పట్ల సీఎం కేసీఆర్ అనేక జాగ్రత్తలు తీసుకుంటున్నారని, సన్న బియ్యంతో మధ్యాహ్నం భోజనం అందిస్తున్నారని, దీనికి తోడు అల్పాహారం అందించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో డీసీ శ్రీనివాస్, ఉప్పల్ తహసీల్దార్ వెంకట నర్సింహారెడ్డి, ఎంఈవో శశిధర్, ప్రధానోపాధ్యాయులు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలోని అన్ని స్కూళ్లలో మౌలిక సదుపాయాలు

మేడిపల్లి: సర్కారు బడిలో చదివే పిల్లలు సామర్థ్యం, నైపుణ్యం కలిగిన పిల్లలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేడిపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్‌తో కలిసి బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలోని అన్ని స్కూళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించామని అన్నారు. ఎన్నో స్కూళ్లు ఆధునిక హంగుల కలిగి కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ఉన్నాయని తెలిపారు. స్కూల్ యూనిఫామ్స్, పుస్తకాలతో పాటు సన్నబియ్యంతో భోజనం పెడుతున్నామన్నారు. నిత్యం ఉదయం తరగతుల ప్రారంభానికి ముందే బ్రేక్‌ఫాస్ట్ అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ దర్గ దయాకర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్, విజయకుమారి, మున్సిపల్ కమిషనర్ నమ్యా నాయక్, కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్‌రెడ్డి, సుభాష్ నాయక్, బచ్చరాజు, మద్ది యుగేందర్ రెడ్డి, బండిరమ్య సతీష్‌గౌడ్, కుర్ర శాలిని, ఎంపాల అనంతరెడ్డి, పాశం శశిరేఖా బుచ్చియాదవ్, కొత్తూరి మహేష్, భీంరెడ్డి నవీన్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

బ్రేక్‌ఫాస్ట్ పథకం భేష్



అల్వాల్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం అందజేస్తున్న కార్పొరేటర్, అధికారులు

అల్వాల్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం అల్వాల్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రారంభించారు. కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్ కెనడీ, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి హాజరై ఉదయం విద్యార్థులకు చక్కటి అల్పాహారంతో కడుపు నింపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పథకంతో శక్తివంతమైన భవిష్యత్ తరాన్ని తయారు చేయవచ్చని తెలిపారు. అల్వాల్ తహసీల్దార్ సుధ, ఏఎంహెచ్ఓ మంజుల, రవీందర్, స్వామి, మల్లేష్‌గౌడ్, సురేందర్‌రెడ్డి, సతీష్, నిర్మలరెడ్డి, వీణ తదితరులు పాల్గొన్నారు.



అల్పాహారం తీసుకుంటున్న విద్యార్థులు

మహిళల సంక్షేమానికి ఎన్నో సంక్షేమ పథకాలు

బీఆర్‌ఎస్ మల్కాజిగిరి పార్లమెంటరి ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి

గౌతంనగర్: మహిళా సాధికారత తెలంగాణ ప్రభుత్వంతోనే సాధ్యమని మల్కాజిగిరి పార్లమెంటరి ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మల్కాజిగిరిలోని లక్ష్మీసాయి గార్డెన్స్‌లో మహిళా సమాఖ్య మహాసభ కార్యక్రమంలో ఆయన స్థానిక కార్పొరేటర్ మేకల సునీతా రాముయాదవ్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సమాఖ్య గ్రూప్‌ల వల్ల కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం కూడా మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని, మహిళా బిల్లు కోసం కూడా మద్దతు ప్రకటించడం జరిగిందన్నారు. మహిళల కోసం కల్యాణలక్ష్మి, షాదీముబారక్, మహిళా శిశు సంక్షేమానికి పౌష్టికాహార కిట్లు, గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం అందజేస్తున్నట్లు చెప్పారు. మహిళల కోసం అరుందతి ఆస్పత్రిలో ఉచితంగా చికిత్సలు అందిస్తున్నట్లు చెప్పారు. దుండిగల్‌లోని అరుందతి ఆస్పత్రికి ప్రతి సోమవారం మల్కాజిగిరి ప్రాంతం నుంచి ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని కల్పిస్తామని హామీ ఇచ్చారు. దస్ ఫౌండేషన్, కళంజియ సమాఖ్య సంస్థకు శాశ్వత భవన నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దస్ ఫౌండేషన్, కళంజియ సమాఖ్య ప్రతినిధులు, అనిత, నాయకులు రాము యాదవ్, రాంచందర్, వేణునాయుడు, కొత్తపల్లి ఉపేందర్‌రెడ్డి, వేలాది మంది మహిళ సమఖ్య ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



కుషాయిగూడ: డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు అభివృద్ధిగా కార్యక్రమాలు చేపడుతున్నట్లు కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. చర్లపల్లి డివిజన్ భరత్‌నగర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనుల్లో నాణ్యత పాటించి త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. స్థానిక సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ స్వరూప, స్థానిక నేతలు నాగిళ్ల బాల్‌రెడ్డి, బొడిగె ప్రభుగౌడ్, శ్రీకాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డబ్బుతో రాజకీయాలు చేయొద్దు..

- బీఆర్‌ఎస్‌లో ఉన్నప్పుడు నోరు నొక్కారు
- ఈ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారు..
- మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు



మాట్లాడుతున్న మైనంపల్లి హన్మంతరావు

మల్కాజిగిరి: ప్రభుత్వం, ఆ పార్టీ నాయకులు.. డబ్బుతో రాజకీయాలు చేయవద్దని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు హితవు పలికారు. బీఆర్‌ఎస్ మల్కాజిగిరి సర్కిల్ అధ్యక్షుడు పిట్ల శ్రీనివాస్ ఆ పార్టీకి రాజీనామా చేసి మైనంపల్లికి మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన నివాసంలో మైనంపల్లి హన్మంతరావు మాట్లాడుతూ ఒక నాయకుడి వెంట డివిజన్‌లో ఉన్న 30 మందిని కొనగలుగుతారేమో కానీ నియోజకవర్గంలోని ప్రజలను కొనలేరని గుర్తుంచుకోవాలన్నారు. ఇది ప్రజాస్వామ్య దేశమని, మల్కాజిగిరిలో కొనుగోలు చేసిన నాయకుల మాటలు నియోజకవర్గంలోని ప్రజలు వింటారా అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో సైలెంట్ ఓటింగ్ జరుగుతుందని, ప్రజలే ప్రభుత్వానికి బుద్ధి చెబుతారన్నారు. రాజకీయాల్లోకి వచ్చి డబ్బులు సంపాదించి ఆ డబ్బుతో రాజకీయాలు చేస్తామనే రోజులు పోయాయన్నారు. పది సంవత్సరాల నుంచి మల్కాజిగిరి నియోజకవర్గానికి వెయ్యి ఇళ్లు కూడా కేటాయించలేదన్నారు. గ్రేటర్ ఎన్నికల ముందు వరదలు వచ్చాయని ఇంటింటికీ రూ.10వేలు ఇస్తామని ప్రభుత్వం చెప్పి ఇవ్వలేదన్నారు. ప్రభుత్వంలో ఉన్నానని నా నోరు నొక్కేయడంతో ఏమీ మాట్లాడలేకపోయానన్నారు. ప్రతి ఇంటి నుంచి ఒక మనిషి ప్రభుత్వాన్ని ప్రశ్నించినప్పుడే తెలంగాణకు న్యాయం జరుగుతుందన్నారు. 2014 నుంచి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉందని, గతంలో అభివృద్ధి జరగలేదని, నా హయాంలో జరిగిన అభివృద్ధి నా సత్తాతోనే జరిగిందన్నారు. ఆత్మ పరిశీలన చేసుకొని ఓటు వేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా

మర్రి రాజశేఖర్‌రెడ్డి



మందులు పంపిణీ చేస్తున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: మల్కాజిగిరి ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని మల్కాజిగిరి టీఆర్‌ఎస్ పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ నానాహిల్స్‌లో అరుంధతి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన మాజీ కార్పొరేటర్ ఆకుల నర్సింగరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాంత్రిక జీవనంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి అరుంధతి ఆస్పత్రి ఏర్పాటు చేశామని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య శిబిరానికి వచ్చిన వారికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఉస్మాన్, సత్తయ్య, విజయకుమారి, చందు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న రవిశంకర్

మల్కాజిగిరి: తెలంగాణ స్టేట్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ మహా సంఘ్(బీఎంఎస్ అనుబంధ) రెండవ మహాసభను జయప్రదం చేయాలని మహా సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ పిలుపునిచ్చారు. మల్కాజిగిరిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌పోర్ట్, ఆటో, ట్యాక్సీ డ్రైవర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తామన్నారు. ఈ నెల 8వ తేదీ మల్కాజిగిరి ఆనంద్‌బాగ్‌లోని బృందావన్ గార్డెన్స్‌లో జరిగే రాష్ట్రసభలో కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు సి.యాదయ్య, పెంటయ్యగౌడ్, ఈశం శంకర్, పరశురాం పాల్గొన్నారు.

విజయ విహార్ కాలనీ సమస్యలను పరిష్కరిస్తాం



అల్వాల్: విజయ విహార్ కాలనీ సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ అన్నారు. కాలనీ సంక్షేమ సభ్యుల వినతి మేరకు అధికారులతో కలిసి శుక్రవారం ఆయన కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో డ్రైనేజీ, విద్యుత్ స్తంభాలు, చెట్ల కొమ్మలు తొలగించడం వంటి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధికారులు కార్తీక్, స్వాతి, సంజయ్, అఫ్రోజ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నాచారం ఈఎస్‌ఐ ఆస్పత్రిలో ఫైర్ స్టేషన్ ప్రారంభం



నాచారం ఈఎస్‌ఐ ఆస్పత్రిలో ఫైర్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి

మల్లాపూర్: నాచారం ఈఎస్‌ఐ ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన అగ్నిమాపక కేంద్రాన్ని శుక్రవారం కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంలో నూతనంగా అగ్ని మాపక కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నామనారు. ఎక్కడ ప్రమాదాలు జరిగినా తక్షణమే అక్కడికి చేరుకొని ప్రమాదాల నుంచి ప్రజలు, ఆస్తులను ఫైర్ అధికారులు, సిబ్బంది కాపాడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ జిల్లా ఫైర్ అధికారి వెంకన్న, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ మల్లేష్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కమల, తెలంగాణ వైద్యుల సంఘం ఈఎస్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్, ఆర్‌ఎంవో రజ్వంత్, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా



మాట్లాడుతున్న ఉప్పల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్: ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని బీఆర్‌ఎస్ ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఈ మేరకు ఉప్పల్ కొమ్మిడి కృష్ణారెడ్డి గార్డెన్‌లో నిర్వహించిన కార్యకర్తల దిశానిర్దేశం కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని కోరారు. ఎలాంటి అనుమానాలకు తావివ్వకుండా ముందుకు సాగాలని, కేసీఆర్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి తిరిగి ఉప్పల్‌లో బీఆర్‌ఎస్ జెండా ఎగురవేయాలని కోరారు. కేసీఆర్ పథకాలు.. మనకు శ్రీరామరక్ష అన్నారు. కార్యక్రమంలో తాడూరి శ్రీనివాస్, గొల్లూరి అంజయ్య, అరటికాయల భాస్కర్, పోగుల దయాకర్‌రెడ్డి, గంధం నాగేశ్వర్‌రావు, మేకల హనుమంతరెడ్డి, ఆకుల మహేందర్, మేకల మధుసూదన్ రెడ్డి, అన్న బాలకృష్ణ, జెట్టి కిషోర్, సుక్క కిరణ్, చింతల నర్సింహారెడ్డి, వివిధ ప్రాంతాల నుంచి కార్యకర్తలు అభిమానులు హాజరయ్యారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని పలు అభివృద్ధి పనులకు శుక్రవారం జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్‌తో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అంబేడ్కర్ విగ్రహం నుంచి భవానీనగర్ వెళ్లే మార్గంలో నాలాపై నూతనంగా రూ.94 లక్షలతో నిర్మించే బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేశారు. రాఘవేంద్రనగర్ పోచమ్మగుడి వద్ద రూ.33 లక్షలతో సీల్ట్ ఛాంబర్ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో డీఈ రూప, ఏఈ లింగారావు, వర్క్‌ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్, బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.

రాఘవేంద్రనగర్‌లో వాగ్వాదం..

రాఘవేంద్రనగర్‌లో శంకుస్థాపనకు వచ్చిన ఎమ్మెల్యే, కార్పొరేటర్‌తో కాలనీలో ఏమి పని చేస్తున్నారని స్థానిక బీజేపీ నేత పాతగాని గోపాల్‌గౌడ్ అడగడంతో వాగ్వాదం చోటుచేసుకుంది.



నాచారం రాఘవేంద్రనగర్‌లో సీల్ట్ ఛాంబర్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

ఫార్మసీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

ఘట్‌కేసర్: ప్రపంచ ఫార్మసీ రంగం ప్రస్తుతం తెలంగాణ వైపు చూస్తోందని నైపర్ బయలాజికల్ సైన్సెస్ విభాగాధిపతి చంద్రయ్య గొడుగు అన్నారు. కొండాపూర్ సంస్కృతి ఫార్మసీ కళాశాల బీ ఫార్మసీ, ఫామ్ డీ మొదటి, ఎమ్ ఫార్మసీ మొదటి సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన ప్రేరణ, పరిచయ(ఓరియెంటేషన్) కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఫార్మసీ ప్రాముఖ్యత, ప్రాధాన్యతను వివరించారు. ఫార్మసీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందని, వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో సంస్కృతి కళాశాల చైర్మన్ ఏవీ రమణారెడ్డి, కళాశాల డైరెక్టర్ మల్లాది రమాకాంత్‌రెడ్డి, ఫార్మసీ ప్రిన్సిపల్ శిరీష, ప్రోగామ్ కోఆర్డినేటర్లు నాగశ్రీ, డాక్టర్ స్వాతి, డాక్టర్ సుధాకర్, చైతన్య, ఫార్మసీ విద్యార్థులు, తల్లి దండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు చేయాలి

ఘట్‌కేసర్: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు చేయాలని ఢిల్లీ ఐఐటీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నిపుణుడు త్రివిక్రం అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో కృత్రిమ విభాగం ఆధ్వర్యంలో 'మీ సొంత జనరేటివ్ ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ మోడల్‌ను నిర్మించడం ఎలా?' అన్న అంశంపై శుక్రవారం నిర్వహించిన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో యూనివర్సిటీ కృత్రిమ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ మల్లికార్జున్, ప్రోగ్రామ్ సంచాలకులు అసిస్టెంట్ ప్రొఫెసర్ సరళ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ముదిరాజ్ శ్మశానవాటిక అభివృద్ధికి రూ.36 లక్షలు



ఉప్పల్ సౌత్ స్వరూప్‌నగర్ కాలనీలో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్: ఉప్పల్ ముదిరాజ్ శ్మశాన వాటికను ఆధునీకరిస్తున్నట్లు ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఉప్పల్ వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ముదిరాజ్‌ల శ్మశానవాటిక అభివృద్ధికి నోచుకోలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, దాన్ని దృష్టిలో ఉంచుకుని నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం నేతలు కార్పొరేటర్‌ను శాలువాతో సత్కరించారు. ఇంటింటికీ కాంగ్రెస్ పథకాలను ప్రచారం చేస్తూ స్థానిక కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్‌రెడ్డి గడప గడపకూ తిరిగారు. ఉప్పల్ సౌత్ స్వరూప్‌నగర్ కాలనీలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు కార్పొరేటర్‌కు మంగళ హారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.